క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీ సుబ్బారావు

దెందులూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు పరిశీలించారు. టెక్నికల్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. తేమశాతం తూకంలో ఆన్‌లైన్ నమోదు ఇతర అన్ని పనులను సక్రమంగా చేయాలన్నారు. కార్యక్రమంలో దెందులూరు మండలం వ్యవసాయ అధికారి దామా వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగేంద్ర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా తూడు తొలగింపు



జేసీబీతో తూడు తొలగిస్తున్న దృశ్యం

దెందులూరు: గోదావరి కాలువలో జేసీబీతో తూడు తొలగింపు ప్రక్రియ శర వేగంగా నిర్వహిస్తున్నామని గోదావరి కాలువ దెందులూరు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం గోదావరి కాలువలో సత్యనారాయణపురం దెందులూరు వద్ద జేసీబీతో తొలగింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. కొవ్వలి నీటి వినియోగదారు సంఘం అధ్యక్షుడు వెలమాటి రాంబాబు, ఏఈ సుబ్రమణ్యం కాలువ వెంబడి ఆరు కిలోమీటర్లు పరిశీలించారు.

శ్రమ దినాల ప్రార్థనలు స్ఫూర్తిదాయకం



సర్పంచ్‌ను సన్మానిస్తున్న సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ 40 శ్రమకాల దినాల్లో ఇంటింటి ప్రార్థనలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మ అన్నారు. సాల్వేషన్ ఆర్మీ సోల్జర్ ఎడ్ల ప్రకాశం నివాసంలో శ్రమ దినాల చివరి రోజు ప్రార్థన కూడిక కోర్ ఆఫీసర్ ఎం.రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఎం.రమణయ్య ప్రత్యేక ఆరాధన ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడుతూ 40 రోజుల పాటు శ్రమ దినాల ప్రార్థనలు నిర్వహించామన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

ఉంగుటూరు: ఉప్పాకపాడు ప్రభుత్వ మెడల్ ప్రైమరీ పాఠశాలలో వార్షికోత్సం ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ చైర్మన్ కర్నాటి వెంకటేష్, ప్రధానోపాధాయయులు నక్కా సుధాకర్ ఆధ్వర్యంలో 99వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయుడు అల్లు శ్రీను శిక్షణలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు శ్రీదేవి మాట్లాడుతూ మన మోడల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ వేము నాగమణి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడిపై గ్యాస్ ధరాభారం!

- వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనపు భారం
- పేదలకు గుదిబండగా మారిన గ్యాస్ సిలిండర్
- డివిజన్‌లో రూ.2.32 కోట్లకు పైగా వడ్డన



గ్యాస్ బండలు

దెందులూరు: సామాన్యుడి వంటింట్లో కూటమి ప్రభుత్వం మళ్లీ మంట పెట్టింది. కొన్ని రోజులగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది. కేంద్ర ప్రభుత్వం పేద, సామాన్య కుటుంబాల్లో గ్యాస్ మంటలు రేపింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ.840 ఉండగా తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచింది. దీంతో పేదవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఉజ్వల పథకం లబ్ధిదారులను సైతం ప్రభుత్వం కనికరించలేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింపు జేయడం గమనార్హం. ఇకపై ప్రతి 15 రోజులకు లేదా నెలకోసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో భవిష్యత్తులో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు ఇచ్చినట్టైంది.

రూ.2.32 కోట్లకు పైగా భారం

గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో ఏలూరు డివిజన్ వ్యాప్తంగా వినియోగదారులపై నెలకు రూ.2.32 కోట్ల మేర అదనపు భారం పడనుంది. డివిజన్ పరిధిలో పలు గ్యాస్ ఏజెన్సీల పరిధిలో మొత్తం 1.94 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో 4600 వరకు వాణిజ్యపరమైనవి. మిగిలిన 1.89 లక్షల కనెక్షన్లకు ఈ పెంపు వర్తించనుంది. ప్రస్తుతం గృహ వినియోగానికి సంబంధించిన 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.840 ఉండగా ఇకపై రూ.890 కానుంది. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చార్జీల పేరుతో వసూలు చేస్తున్న మొత్తం అదనం. దీంతో సిలిండర్‌కు కనీసం రూ.920 సమర్పించుకోవాలి.

ధరల పెంపుతో తప్పని తిప్పలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఒక వైపు కూరగాయల ధరలు భగ్గుమంటూ ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు వంట గ్యాస్ సిలిండర్ ధర పెరగడం చాలా బాధకరం. ప్రభుత్వాలు సంబంధించి ధరలను అదుపు చేసి పేదలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

గ్యాస్ ధర తగ్గించాలి



సామాన్యులపై ప్రభుత్వం ఇప్పటికే కరెంటు చార్జీలతో పాటు అనేక భారాలు మోపింది. డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడానికి కారణమైంది. ఈ పరిస్థితుల్లో పేదవాళ్లు బతకడమే కష్టంగా ఉంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా ధరలు పెంచుకుంటూ పోవడం సమంజసం కాదు.

– ప్రసన్న, వార్డు మెంబర్, అలుగులగూడెం

సామాన్యుడిపై తీవ్ర ప్రభావం



వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపు సామాన్య ప్రజలకు భారమవుతుంది. పేద, మధ్య, తరగతి ప్రజానీకంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే కొనలేని స్థితిలో ఉన్న గ్యాస్ సిలిండర్ ధర మరింత పెరగడం సామాన్యులకు ఆవేదన కలిగిస్తుంది. సగటున ఒక్కో కుటుంబం ఏడాదికి ఆరు సిలిండర్లు కొనుగోలు చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం వలన పేదలు అదనపు భారం మోయాల్సి వస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సిలిండర్, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలి.

– కృష్ణవేణి, వార్డుమెంబర్, దెందులూరు

టోల్‌ప్లాజాను మార్చాలని డిమాండ్

ఉంగుటూరు: టోలు ప్లాజాను ప్రభుత్వం రైతులవద్ద సేకరించిన భూమిలోకి మార్చాలని లేకపోతే ఆందోళన చేపడతామని ప్రజా ప్రతినిధులు హెచ్చరించారు. ఈ మేరకు ఉంగుటూరు చుట్టు పక్కల ఆరు గ్రామాల పంచాయతీలు తీర్మానాలు చేశారు. టోల్ ప్లాజా నిర్వాహకలుకు పంచాయతీలు తీర్మానాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ప్రజా ప్రనిధులు ఆందోళన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ఇప్పుడున్న టోల్ ప్లాజాను గతంలోనే భూసేకరణ చేసిన నాచుగుంట-వెల్లమిల్లి మధ్య ఏర్పాటుచేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీఏపురం సర్పంచి సింగులూరి ధర్మరావు, కాకర్లమూడి సర్పంచి నౌడు వెంకట్రావు, దొంతవరం మాజీ సర్పంచి శ్రీరెడ్డి నర్శింహరావు, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు చిట్టూరి హరిబాబు, ఇమ్మని గంగాధరరావు, కంభంపాటి పెద్దిరాజు, రంభ శేఖర్, కాళ్ల మహంకాళి, పొట్ల ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రవేశాల ప్రకటన

గణపవరం: స్థానిక శ్రీచింతలపాటి వరప్రసాదమూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. ప్రస్తుతం ఇంటర్ పాసైన విద్యార్థులు, 2024–25 సంవత్సరంలో బ్యాక్‌లాగ్‌లో పాసైన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం పొందొచ్చన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీలో ఐదు గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఇంటర్‌లో పొందిన మార్కుల ఆధారంగా వారికి ఇష్టమైన గ్రూపును ఎంపిక చేసుకోవచ్చని ఆమె సూచించారు.

ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



అయిల్ ట్యాంకర్ల ప్రమాదాన్ని ఫోమ్ సాయంతో అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ఎత్తైన ప్రదేశాల్లో మంటలను జెడ్ పరికరంతో అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

భీమడోలు: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణలపై భీమడోలు జంక్షన్ వద్ద అగ్నిమాపక సిబ్బంది నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. తొలుత భీమడోలు జంక్షన్ వద్ద అగ్నిమాపక రథం ఉంచి అక్కడ పలు విన్యాసాలు చేశారు. అగ్ని ప్రమాదంలో మంటలను అదుపు చేయడం, రసాయనాలు, అయిల్ ట్యాంకర్లు ఫ్యాకరీల్లో జరిగే పెను ప్రమాదాలను ఫోమ్‌తో అరికట్టడంపై ప్రదర్శనలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. మంట తక్కువ, పొగ ఎక్కువగా ఉన్న సమయంలో రివాల్వింగ్ పరికరంతో, ఎత్తైన ప్రదేశంలో అగ్ని ప్రమాదాలు అదుపు చేసే జెడ్ విన్యాసాలను ప్రదర్శించారు. అనంతరం ఫైర్ అధికారి జి.నాగరాజు మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటాయని, అప్రమత్తతతో మెలగాలన్నారు. మన భద్రత మన చేతుల్లో ఉంటుందని తెలిపారు. ప్రతి రోజూ వేర్వేరు ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసుబాబుకు కృతజ్ఞతలు



వాసుబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న నూతన మండల అధ్యక్షులు

నిడమర్రు: వైఎస్సార్‌సీపీ సంస్థాగత మార్పుల్లో భాగంగా మండల స్థాయిలో నూతన కమిటీలను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని నూతన కమిటీల నాలుగు మండలాల అధ్యక్షులు మంగళవారం బువ్వనపల్లిలోని వైఎస్సార్‌సీపీ క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును కలిసి పుష్పగుచ్ఛంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిడమర్రు, గణపవరం, ఉంగుటూరు, భీమడోలు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సంకు సత్యకుమార్, దండు రాము, మరడా వెంకట మంగారావు, రాయపాటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరుగుతున్న మోసాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపి ఎండగట్టాలని వాసుబాబు పిలుపునిచ్చారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు సమక్షంలో విద్యార్థిని బడిలో చేర్పుతున్న తల్లి

భీమడోలు: బడిఈడు పిల్లలను ప్రభుత్వ ప్రభుత్వ బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని భీమడోలు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లు ఆయన పరిశీలించారు. విద్యార్థులు విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం హెచ్‌ఎం నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్‌లతో కలిసి ఆయన ప్రత్యేక బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులు, టీచర్లు, ర్యాలీ చేశారు. ఐదేళ్లు నిండిన చిన్నారుల ఇంటింటికీ వెళ్లి వారు బడిలో చేరాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన టీచర్లు, చక్కని సదుపాయాలు, వసతులు సమకూరాయని, నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యమంటూ విద్యార్థులకు వివరించారు. ఉన్నత విద్యను అభ్యసించిన ఉపాధ్యాయులచే ఉత్తమ విద్యాబోధన అందుతుందని పేర్కొన్నారు. పలువురు విద్యార్థులను చేర్చుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వకుండా భవనం ప్రారంభమా?



సర్వసభ్య సమావేశంలో సమస్యను లేవనెత్తిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు అంబటి దేవి

భీమడోలు: పోలసానిపల్లిలో రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి వెచ్చించిన బిల్లులను ఇవ్వకుండా ఆ భవనాన్ని పంచాయతీ భవనంగా మార్పు చేసి ప్రారంభించడం సమంజసం కాదని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అంబటి దేవి సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కాంట్రాక్టర్ బిల్లుల కోసం కోర్టులో కేసు వేశారని, కోర్టు పరిధిలో ఉన్న భవనాన్ని ఎలా ప్రారంభిస్తారని సభలో ఎంపీపీ కనుమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవిలతో పాటు మంగళవారం సర్వసభ్య సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సభ రసాభాసగా మారింది. గ్రామంలోని కూటమి పాలకులు, నాయకులు ఇష్టానుసారంగా పాలన సాగిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. దీనిపై గ్రామ కార్యదర్శిని ఎంపీపీ, ఎంపీడీవోలు సభకు పిలిపించారు. ఆయనతో పాటు సర్పంచ్ షేక్ రహీమాబేగం, వార్డు సభ్యులు వచ్చి వివరణ ఇచ్చారు. ఆర్‌బీకే భవనం చేపట్టడం వాస్తవమేనని, అయితే ఆతడికి కేవలం రూ.లక్ష నగదు ఇవ్వాలని కాంట్రాక్టర్ అంబటి నాగేంద్ర ప్రసాద్ అంగీకరించాడన్నారు. పంచాయతీ ఆ సొమ్ము ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. దీనిపై ఎంపీటీసీ సభ్యురాలు అంబటి దేవి బిల్లులను ఇచ్చిన తర్వాతే భవనాన్ని ప్రారంభించాలి తప్ప ఏకపక్షంగా ప్రారంభించటమేమిటని ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి తాము మరో సమావేశం నిర్వహిస్తామని ఎంపీపీ చెప్పి వారిని పంపించేశారు. కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పోషక విలువల ఆహారం తీసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న శారద

ఉంగుటూరు: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల బహుళప్రయోజనాలు చేకూరతాయని స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారిణి పి.శారద అన్నారు. మంగళవారం కైకరం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడకు చేరిన తల్లులతో సమావేశం నిర్వహించి, శారథ మాట్లాడుతూ 1000 రోజుల పాటు గర్భిణులు, తల్లుల సంరక్షణ గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా సరఫరా అయ్యే ఆహారం ఎంతో పోషక విలువలతో కూడినదని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీవీ శ్రీలక్ష్మి, డి.శారదా మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ కోడే కాశి

నిడమర్రు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు నేటితరం యువత కృషి చేయాలని నిడమర్రు జెడ్పీటీసీ కోడే కాశి అన్నారు. పెదనింద్రకొలను ఎస్సీ కాలనీలో రూ.2.5 లక్షలతో అంబేడ్కర్ విగ్రహం ఆధునీకరణ పనులు నిర్వహించారు. ఈ నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం రాత్రి జెడ్పీటీసీ కోడే కాశి అవిష్కరించారు. ఈ విగ్రహ వేదిక ఆధునీకరణ పనులకు జెడ్పీటీసీ కోడే కాశి రూ.2.25 లక్షలు, గ్రామ సర్పంచ్ రూ.25 వేలు ఆర్థిక సాయం అందించినట్లు ఎస్సీ కాలనీ జైభీమ్ యూత్ కమిటి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి ఎస్.బాబూరావు, మాలసేవ రాష్ట్ర వ్యవస్థాపకులు ఎరికిపాటి విజయ కుమార్, సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, వైస్ ఎంపీపీ బండి రమణ విస్సాకు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): నగరంలో స్వైర విహారం చేస్తున్న వీధి కుక్కలను అరికట్టాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కు వినతి పత్రం అందజేశారు. కుక్కల వల్ల మహిళలు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గణపవరం: మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, నాలుగు ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ సీడీపీవో ఓ ప్రకటనలో తెలిపారు. గణపవరం మండలం కొత్తపల్లి (ఓసీ), కోమర్రు–2 (ఓసీ) గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, మొయ్యేరు–1 (బీసీ–ఇ) గణపవరం–3(ఓసీ), గణపవరం–9(బీసీ–డీ), కొత్తపల్లి (ఎస్సీ) అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్థానిక మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. వయస్సు 1 జూలై 25 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు లోపు ఉండాలి. కనీస విద్యార్హత పదో తరగతి పాసై ఉండాలి. ఈ అర్హతలు ఉన్న వారు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను తాడేపల్లిగూడెంలోని పత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.


కూటమి హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

భీమడోలు: ఎన్నికల్లో గుప్పించిన హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, వెంటనే కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలని ఎంపీపీ కనుమాల రామయ్య అన్నారు. భీమడోలు సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ కనుమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. సభ కోరం లేక ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ హాజరయ్యారు. ఎంపీపీ కనుమాల రామయ్య మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి గద్దె నెక్కిన కూటమి ప్రభుత్వం తల్లికి వందనం, నిరుద్యోగ భృతి హామీలను పట్టించుకోవడం లేదన్నారు. అత్యవసర పనులకు నిధులు కోసం జెడ్పీ చైర్మన్‌ను కలిసి నిధులు కోరతామన్నారు. ఉపాధి హామీ పథకంలో వేతనాలు అందక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాశాఖ సమీక్షలో పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు. దీనికి ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు స్పందించారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి ఆధ్వర్యంలో శాఖల వారీగా సమీక్షించారు. మండల పరిషత్ సభ్యులు శాఖల వారీగా సభలో సమస్యలను ఏకరువు పెట్టారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అందుబాటులో ఉండడం లేదని, చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. తమ సమస్యను లిఖితపూర్వకంగా జెడ్పీటీసీకి అందజేయాలని ఎంపీపీ కోరారు. ఎంపీటీసీ సభ్యులు ముళ్లగిరి జాన్సన్ అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయాయని, వాటిని కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఏమైనా జీవో జారీ చేసిందని ఆమె గ్రామ వ్యవసాయ సహాయకులను ప్రశ్నించారు. తేమ శాతం ఒక శాతం పెరిగినా రైలు మిల్లర్లు కొనుగోలు చేస్తారని సమాధానమిచ్చారు. గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని, ఎక్కడా అబ్కారీ శాఖ పట్టించుకోవడం లేదని ఎక్సైజ్ ఎస్సైని సభ్యులు ప్రశ్నించారు. సమస్యపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఎస్సై తెలిపారు. ఇంకా పలు సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో సభ్యులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 25వ తేదీ వరకు గోదావరి కాలువకు నీటి సరఫరా అవుతుందని, డిస్ట్రిబ్యూటరీ కమిటి చైర్మన్ గంథం లక్ష్మణ్ సభ దృష్టికి తీసుకుని వచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

ఉంగుటూరు: ర్యాంకులు సాధించిన విద్యార్థులను నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు. ఈ మేరకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు రెండేళ్లుగా పోటీ పడి మరీ మంచి మార్కులు సాధించారన్నారు. 90 శాతం పైనే మార్కులు సాధించిన విద్యార్థులు ఏడుగురు ఉన్నారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 62 మందికిగాను 53 మంది ఉత్తీర్ణులయ్యారని, 85 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 118 మందికి గాను 71 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు వివరించారు.

పోణంగిలో అగ్నిప్రమాదం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మెరుగుమాల రాజేంద్రప్రసాద్‌కు చెందిన 15 ఎకరాల గడ్డి వాము దగ్ధమైంది. ఏలూరు ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.